సాక్షి
వికారాబాద్
శనివారం ׀ 6 ׀ జూలై ׀ 2024



సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ టీచర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొడంగల్‌లో ధర్నా నిర్వహించారు. 10లో▸



ఆలయ భూమిని కాపాడండి

అంబురామేశ్వర ఆలయ భూములను కాపాడాలని శుక్రవారం ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ కిషన్‌ను కోరారు. 10లో▸



వేతన వెతలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా జీపీ కార్మికులు సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. 11లో▸

బదిలీలకు వేళాయె..

ఇప్పటికే పూర్తయిన టీచర్ల ట్రాన్స్‌ఫర్లు

- బదిలీలపై బ్యాన్ ఎత్తివేయడంతో అన్ని శాఖలకు అవకాశం
- పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో కొందరికే ఛాన్స్
- ఈ సారి బదిలీ కానున్న మెజార్టీ జిల్లా అధికారులు
- స్పెషల్ జీఓ ఇస్తే తప్ప ఎంపీడీఓలు, తహసీల్దార్లకు కష్టమే



వికారాబాద్: ఉద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బదిలీలకు సమయం రానేవచ్చింది. రాష్ట్రంలో పదేళ్లుగా ఉద్యోగుల సాధారణ బదిలీలు జరగలేదు. తాజాగా ప్రభుత్వం బదిలీలకు అడ్డుగా ఉన్న బ్యాన్ ఎత్తి వేయడంతో లైన్ క్లియర్ అయ్యింది. ఇప్పటికే జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ముగిసింది. సగానికి పైగా టీచర్లు ట్రాన్సఫర్ అయ్యారు. ఇతర శాఖల్లోని ప్రభుత్వ ఉద్యోగులు బదిలీల కోసం ఎదురు చూస్తుండగా ఆయా శాఖల వారీగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న జిల్లాస్థాయి అధికారుల్లో సగం మంది వారి గరిష్ట కాలపరిమితి ముగియడంతో ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం ఉంది. ఇదే సమయంలో కింది స్థాయి ఉద్యోగులు సైతం చాలా కాలంగా ఒకే చోట పనిచేస్తున్న నేపథ్యంలో వారికి కూడా స్థాన చలనం తప్పదని తెలుస్తోంది.

మండల, జిల్లా పరిషత్‌లలో కొందరికే చాన్స్

ఈ సారి మండల, జిల్లా పరిషత్‌లలోని మెజారిటీ అధికారులకు బదిలీకి అవకాశం లేకుండా పోయింది. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలోనే లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ప్రభుత్వం ప్రత్యేక జీఓ ఇస్తే తప్ప వారి బదిలీలకు అవకాశం లేదు. కలెక్టర్, ఎస్పీ తోపాటు అడిషనల్ కలెక్టర్లు, అడిషనల్ ఎస్పీ, ఇద్దరు ఆర్డీఓలు జిల్లాకు బదిలీపై వచ్చారు. వీరి గరిష్ట కాలపరిమితి నాలుగేళ్లు పూర్తి కానందున వారు ఇక్కడే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. తహసీల్దార్లందరూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాకు వచ్చిన వారు కాగా.. మండల పరిషత్‌లలో మెజార్టీ ఎంపీడీఓలు పార్లమెంట్ ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చారు. ఎన్నికలు ముగిసినందున సొంత ప్రాంతాలకు వెళ్లాలనే ఆలోచనతో ఉన్నారు. అయితే వారి బదిలీలకు నిబంధనలు అడ్డుగా మారాయి. ఇక్కడికి వచ్చి రెండు సంవత్సరాల కాల పరిమితి పూర్తి చేసుకున్న వారికి మాత్రమే ఆప్షన్ ఎంచుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతో వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక జీఓ ఇస్తే తప్ప సొంత ప్రాంతాలకు వెళ్లటానికి వీలుపడదు.

మెజార్టీ జిల్లా అధికారులకు..

మెజార్టీ జిల్లా అధికారులు మూడేళ్ల కంటే ఎక్కువ కాలం నుంచే విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో కొందరు ఇటీవలే మూడేళ్లు పూర్తి చేసుకోగా మరి కొందరు ఏడు సంవత్సరాలుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం జిల్లాలో చాలా మంది హెచ్‌ఓడీలు(ఆయా శాఖల జిల్లా బాస్‌లు) గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే బదిలీ కావాల్సి ఉన్నా కాలేదు. నలుగురు అధికారులు మాత్రం పార్లమెంట్ ఎన్నికల సమయంలో బదిలీ అయ్యారు. మిగతా శాఖల జిల్లా అధికారులు ఎన్నికల సమయంలోనూ బదిలీ కాలేదు. దీంతో పది మందికి పైగా జిల్లా అధికారులు ఇతర జిల్లాకు వెళ్లే అవకాశం ఉంది. బదిలీల బ్యాన్ ఎత్తివేత ఈ నెల 20వ తేదీ వరకు వర్తించనుండటంతో ఈ 15 రోజులు అధికారులు బదిలీల్లో బీజీగా మారనున్నారు.

గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- 18మందిని ఆస్పత్రికి తరలింపు
- 12మంది డిశ్చార్జి
- పరామర్శించిన స్పీకర్, కలెక్టర్

అనంతగిరి: వికారాబాద్ పట్టణం అనంతగిరిపల్లి సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఒక్కసారిగా విరేచనాలు, వాంతులు కావడంతో వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయంత్రానికి ఆరోగ్యం కుదుటపడటంతో 12మంది విద్యార్థులను డిశ్చార్జ్ చేశారు. ఆరో ఆరుగురికి వైద్యం అందుతోంది. గురువారం రాత్రి విద్యార్థులు అన్నం, పప్పు, పెరుగు, చిక్కుడు కాయ కర్రీ, శుక్రవారం ఉదయం పులిహోర, పెరుగన్నంటి తిన్నట్లు తెలిసింది. స్కూల్ ప్రిన్సిపాల్ సూచన మేరకు వసతిగృహంలో వైద్యులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా పలువురు విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నారు. కొందరిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరి కొందరిని తల్లిదండ్రులతో ఇంటికి పంపినట్లు తెలిసింది. పారిశుద్ధ్య లోపంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. వంట గది, మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వారు కోరారు.

మెడికల్ క్యాంప్ ఏర్పాటు

వసతి గృహ విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వాన్‌కుమార్ శుక్రవారం గురుకులాన్ని సందర్శించారు. గడిచిన రెండు రోజులుగా కొంత మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు కావడంతో కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సృజన గురుకులంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్ఓ పాఠశాలలోని వంట గది, భోజనశాల, పారిశుద్ధ్యాన్ని పరిశీలించి అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. తాగునీరు, ఆహారం కలుషితం కాకుండా తీసుకోవాలని ఆదేశించారు.



చికిత్స పొందుతున్న విద్యార్థితో మాట్లాడుతున్న స్పీకర్, కలెక్టర్

విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు మెడికల్ క్యాంపు కొనసాగుతుందని తెలిపారు.

పరామర్శించిన స్పీకర్, కలెక్టర్

విషయం తెలుసుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం వసతి గృహాన్ని సందర్శించి అక్కడి భోజన శాల, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కిషన్ నాయక్, రత్నారెడ్డి, రమేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం

విద్యార్థుల ఆరోగ్యం గురించి తల్లిదండ్రులు భయపడాల్సిన పని లేదని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని రేపటిలోగా కోలుకుంటారని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. అనంతగిరిపల్లి గురుకులాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

న్యూస్‌రీల్

రాస్నం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా హేమ

ధారూరు: ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని రాస్నం సెక్షన్ ఇన్‌చార్జ్ సెక్షన్ ఆఫీసర్‌గా హేమ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడి అధికారి మోయినొద్దీన్ సెలవుపై వెళ్లడంతో డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ వికారాబాద్‌లో స్పెషల్ డ్యూటీలో ఉన్న హేమను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి వికారాబాద్‌లో చేపట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఆస్పత్రి, వైద్య కళాశాల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. త్వరలో ప్రారంభించే ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు ఉండాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుదీర్, ఆర్డీఓ వాసుచంద్ర, ఆర్అండ్‌బీ ఈఈ లాల్ సింగ్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పటిష్టంగా ఉంది

- పార్టీకి కార్యకర్తలే సైనికులు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సబితారెడ్డితో బీఆర్ఎస్ మండల నేతలు

వికారాబాద్: మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నవాబుపేట మండల నాయకులు సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడినా నష్టం లేదన్నారు. బీఆర్ఎస్‌కు సైనికులు లాంటి కార్యకర్తలు ఉన్నారని పేర్కొన్నారు. మండలంలో పార్టీ బలంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య కారు గుర్తుపై గెలిచి వ్యక్తిగత స్వలాభం కోసం కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. ఆయన వెంట సొంత మండలం, స్వగ్రామం ప్రజలు కూడా నడవరని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే యాదయ్య పార్టీ మారినా తాము బీఆర్ఎస్‌లోనే కొనసాగుతామని మండల నాయకులు స్పష్టం చేశారు. అంతకుముందు పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ.. తామంతా కార్తీక్‌రెడ్డి, సబితారెడ్డి నాయకత్వంలో పని చేస్తామన్నారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పోలీస్ రామిరెడ్డి, ఎంపీటీసీ ఫోరం మాజీ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు విజయ్ కుమార్, పురుషోత్తం, నాయకులు భరత్‌రెడ్డి, ప్రకాశం, మహేశ్వర్ రెడ్డి, శాంతకుమార్, అఫ్సర్ ఖాన్, శ్రీకాంత్ గౌడ్, నరసింహారెడ్డి రఘుపతి రెడ్డి, శ్రీకాంత్, ధర్మయ్య, జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర దిలీప్‌గౌడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ నోటిఫికేషన్ లేక లక్షలాది మంది యువకులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లాలో అక్రమ టీచర్ల బదిలీలను నిలిపివేయాలని అన్నారు. డబ్బులు తీసుకొని బదిలీలు చేస్తున్నారని, అవినీతికి పాల్పడుతున్న డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పరిష్కరించేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నోముల దయానంద్, లచ్చిరెడ్డి, అశోక్, భగీరథ, పగడాల శ్రీశైలం, పాండు, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్, విశ్వనాథ్‌గౌడ్, బీరప్ప, రాఘవేందర్, శివ, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శరత్

చదువు, భోజనంలో రాజీపడొద్దు

- గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డాక్టర్. శరత్
- గురుకుల, గిరిజన వసతి గృహ అధికారులతో సమీక్ష

అనంతగిరి: గురుకులాలు, గిరిజన వసతి గృహాల్లో నాణ్యమైన విద్య తోపాటు, మంచి భోజనం అందించాలని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డాక్టర్. ఏ శరత్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురుకుల, గిరిజన వసతి గృహ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాల్లో ప్రవేశాలకు పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గురుకులాల్లో సామర్థ్యం మేరకు విద్యార్థులు ఉండాలన్నారు. జిల్లాలో క్లస్టర్ వారీగా వంట వారిని గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. పిల్లలకు సరైన భోజనం పెట్టకపోతే వారి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని తెలిపారు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో ఎక్కడా రాజీ పడొద్దని సూచించారు. సన్న బియ్యం సరఫరా అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు లేకుండా చూస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, ఎస్సీ వెల్ఫేర్ డీడీ హేమలత, జిల్లా ఎస్సీ, సంక్షేమ శాఖ అధికారి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'జుంటుపల్లి' బాధ్యత నాదే

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రాజెక్టు సందర్శన



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

యాలాల: మండలంలోని అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు జుంటుపల్లిని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఇరిగేషన్ శాఖ సీఈ ధర్మ, ఎస్ఈ రంగారెడ్డి, ఈఈ సుందర్‌తో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. తూము, కాలువలు, లీకేజీ తదితర వివరాలను ఆయకట్టు రైతులను అడిగి తెలుసుకున్నారు. కుడి, ఎడమ కాలువల పరిస్థితి దారుణంగా ఉందని రైతులు ఎమ్మెల్యేకి వివరించారు. చివరి ఆయకట్టుకు నీరందడం లేదని, కాలువలు, తూములకు మరమ్మతులు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన జుంటుపల్లికి పూర్వవైభవం తెస్తామని తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ.110 కోట్ల అంచనా వ్యయాన్ని గుర్తించినట్లు తెలిపారు. జుంటుపల్లి ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.15 కోట్ల అంచనా వ్యయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు అభివృద్ధే ధ్యేయంగా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రాజెక్టు కింద 2,400 ఎకరాల ఆయకట్టు ఉందని, సగం భూములకు కూడా నీరందడం లేదనే విషయాన్ని రైతులు తమ దృష్టికి తెచ్చినట్లు పేర్కొన్నారు.

త్వరలో నివేదిక

జుంటుపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధుల అంచనా వ్యయాన్ని తయారు చేసి త్వరలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి అందజేస్తామని ఇరిగేషన్ ఈఈ ధర్మా తెలిపారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల తోపాటు తూములు దెబ్బతిన్నాయన్నారు. మరమ్మతులకు గాను క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వ్యయం తయారు చేస్తామన్నారు. సుమారు రూ.15 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి మరమ్మతు పనులను ఏడాది లోపు పూర్తి చేస్తామన్నారు.

కబ్జాలను సహించం

నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను కబ్జా కోరల నుంచి రక్షిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కబ్జాల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. ఈ విషయంలో ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో డీఈ కిష్టయ్య, ఏఈ నవీన్‌కుమార్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్ బాబా, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, బీసీ సెల్ అధ్యక్షుడు అమృతప్ప, నాయకులు హన్మంతు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలకు కొత్త పాలకులు

- తాండూరు చైర్మన్‌గా పట్లోళ్ల బాల్‌రెడ్డి, బషీరాబాద్ చైర్మన్‌గా మాధవరెడ్డి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



మాధవరెడ్డి



పట్లోళ్ల బాల్‌రెడ్డి

తాండూరు, బషీరాబాద్: తాండూరు, బషీరాబాద్ మార్కెట్ కమిటీల నూతన కార్యవర్గాలను ప్రకటిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త పాలకవర్గాలు రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వర్తిస్తాయని పేర్కొంది. ఇందులో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పట్లోళ్ల బాల్‌రెడ్డి, బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జీవన్గికి చెందిన మాధవరెడ్డి నియమితులయ్యారు. తాండూరు వైస్ చైర్మన్‌గా మేడికొండ నర్సిరెడ్డి, సభ్యులుగా ఎండీ.అమ్జద్‌అలీ, జర్నప్ప, రాథోడ్ తులసీరామ్, మహ్మద్ కరీం, కోటం ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఈడ్గి నర్సింహాగౌడ్, ఉప్పరి మొగులయ్య, బిస్మిల్లాబీ, జి.శ్రీనివాస్, మేకల రాజు, భోజిరెడ్డి, మాణిక్యం, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ రుద్రమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, జిల్లా మార్కెటింగ్ డైరెక్టర్లు సభ్యులుగా నియమితులయ్యారు. బషీరాబాద్ వైస్ చైర్మన్‌గా ముడావత్ చందర్, సభ్యులుగా నరేష్, షేక్ మునీర్ అహ్మద్, నాదిర్గా మోహన్, నరేష్ రాథోడ్, సోంపల్లి వనమాల, మహేందర్‌రెడ్డి, వడ్డె హన్మంతు, పెంటప్ప, అగ్గనూరు సత్తయ్య, కోవూరి నరేశ్, పాండురంగ, అనుప్ ప్రసాద్, నవాంద్గీ సొసైటీ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వికారాబాద్ జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు, బషీరాబాద్ ప్రత్యేక అధికారిని సభ్యులుగా నియమించింది.

ధ్రువీకరణ పత్రాల అందజేత



సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ అన్నారు. ఈమేరకు శుక్రవారం వికారాబాద్ పట్టణం శివారంనగర్ కాలనీలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గాయత్రి, చందర్‌నాయక్, నాయకులు లక్ష్మణ్, సంస్థ కోఆర్డినేటర్ రిత్విత తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పెంపును విస్మరించడం తగదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెన్షన్లు పెంచాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6 వేలు, మహిళలకు రూ.4వేల పెన్షన్ అందజేయాలన్నారు. అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతా మని చెప్పి మాట మరిచారన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించినట్లు దివ్యాంగులకు సైతం అనుమతించాలన్నారు. రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్ (పీహెచ్‌డీ) వయసు, నెట్ నుంచి దివ్యాంగులందరికీ మినహాయింపు ఇవ్వాలని కోరారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

కారుతో గుద్ది.. పురుగు మందు తాగి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వికారాబాద్: కారు నడుపుతున్న వ్యక్తి ప్రమాదవశాత్తు పాదచారిని ఢీ కొట్టడంతో అతని కాలు విరిగింది. ఆ తర్వాత ఇంటికి చేరుకున్న సదరు వ్యక్తి భయంతో పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మర్పల్లి మండలం బూచన్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. మర్పల్లి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాడి మైపాల్‌రెడ్డి(32) తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటు కూలీ పనులకు వెళ్లేవాడు. బుధవారం వికారాబాద్ మండలం కొంపల్లిలో బంధువు మృతి చెందడంతో భార్య మంజులతో కలిసి అంత్యక్రియలకు కారులో వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా మండలంలోని సిరిపురం వీరణ్ణ వాగు వద్ద రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న కోహీర్ విఠల్‌కు కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో విఠల్ కాలు విరిగింది. స్థానికులు మైపాల్‌రెడ్డి కారులో విఠల్‌ను సంగారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. మైపాల్‌రెడ్డి అదే రోజు ఆర్టీసీ బస్సులో భార్యతో కలిసి ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి మద్యం సేవిస్తూ ఇంట్లోనే ఉండిపోయాడు. విఠల్ కుటుంబ సభ్యులు గురువారం మైపాల్‌రెడ్డికి ఫోన్ చేసి వైద్యం కోసం రూ. 6 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలో తెలియక ఆందోళన చెందిన మైపాల్‌రెడ్డి సాయంత్రం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల, కూతురు అక్షయ(12) కుమారుడు గణేష్‌రెడ్డి(10) ఉన్నారు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లేశం తెలిపారు.



మైపాల్‌రెడ్డి (ఫైల్)

క్లుప్తంగా

సదరం క్యాంప్ కోసం స్లాట్ బుక్ చేసుకోండి

అనంతగిరి: సదరం క్యాంపునకు వచ్చే దివ్యాంగులు శనివారం ఉదయం 11 గంటల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 23, 24, 30, 31 తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు ఉంటుందని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం, బుద్ధి మాంద్యం , చెవుడు, మూగ వారు హాజరుకావచ్చన్నారు. అలాగే 9, 16, 19, 25 తేదీల్లో వికారాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించే సదరం క్యాంపులో స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం, అంధులు హాజరుకావాలన్నారు. గతంలో సదరం సర్టిఫికెట్ పొంది కాల పరిమితి ముగిసిన వారు కూడా స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మొత్తం 650 స్లాట్స్ అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

జెడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



జెడ్పీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్

అనంతగిరి: జెడ్పీ చైర్‌పర్సన్ పదవీ కాలం గురువారంతో ముగియడంతో శుక్రవారం జెడ్పీ సీఈఓ చాంబర్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుధీర్.. కలెక్టర్‌ను సాదరంగా ఆహ్వానించారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్
మరో ఏడుగురి బైండోవర్

మొద్గుల: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు బైక్‌ను సీజ్ చేశారు. ఈ ఘటన మాడ్గుల మండలం సంద్రలగడ్డ, అప్పారెడ్డిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆమనగల్లు ఎక్సైజ్ శాఖ సీఐ బద్యానాద్ చౌహాన్ మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, తండాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో చారకొండ మండలం నుంచి ఇర్విన్‌కు బైక్‌పై వెళ్తున్న మాడ్గుల మండల సంద్రలగడ్డకు చెందిన సబావత్ దేవ్లాను తనిఖీ చేయాగా 6లీటర్ల నాటు సారా లభ్యమైందన్నారు. సారాతో పాటు బైక్‌ను సీజ్ చేసి దేవ్లాను అరెస్టు చేశామన్నారు. నాటు సారా కేసుల్లో నిందితులుగా ఉన్న మరో ఏడుగురిలో మాడ్గుల తహసీల్దార్ వద్ద ముగ్గురిని, తలకొండపల్లి తహసీల్దార్ వద్ద ఒకరిని, కడ్తాల్ తహసీల్దార్ వద్ద ముగ్గురిని బైండోవర్ చేశామని తెలిపారు.

వివాహిత బలవన్మరణం

కొత్తూరు: ఉరేసుకుని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఉమాశంకర్, ప్రియాంక(26) దంపతులు. వీరు జీవనోపాధి కోసం పట్టణానికి వచ్చి సాయికృష్ణ మినీ ఫంక్షన్‌హాల్ కింద అద్దెకు ఉంటున్నారు. భర్త ఉదయం ఓ పరిశ్రమలో విధులకు వెళ్లగా మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. గమనించిన పక్క గది వారు భర్తకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వారు కిందకు దించగా అప్పటికే ఆమె మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా
- గంటపాటు నిలిచిపోయిన వాహనాలు
- ట్రాఫిక్‌కు అంతరాయం
- ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కొడంగల్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొడంగల్ బస్టాండ్ వద్ద అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు వస్తారనే సమాచారంతో జిల్లాలోని అంగన్‌వాడీలు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జయలక్ష్మి మాట్లాడుతూ.. తమకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో భాగంగా టీచర్లకు రూ. 2 లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష, వీఆర్ఎస్ సౌకర్యం తోపాటు జీతంలో సగాన్ని పెన్షన్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం దీనిపై హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జీఓ నంబర్ 10ని రద్దు చేసి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. 48 ఏళ్లుగా సేవలు అందిస్తున్న తమకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా కారణంగా ట్రాఫిక్ జామ్ కావడంతో డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి నిరసనకారులతో మాట్లాడారు. స్పష్టమైన హామీ ఇచ్చేవరకు తమ ఆందోళన ఆగదని అంగన్‌వాడీలు తేల్చి చెప్పడంతో వారిని కొడంగల్, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్పీ నారాయణరెడ్డి కొడంగల్‌కు చేరుకొని పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి గురుమూర్తి, బుగ్గప్ప, శ్రీనివాస్, మంజుల, స్వరూప, నిర్మల, కమల తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో మాజీ మంత్రి కొప్పుల పర్యటన

తాండూరు: పట్టణంలో శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పర్యటించారు. వ్యక్తిగత పనుల నిమిత్తం తాండూరుకు వచ్చిన ఆయన తొలుత యాలాల మండలంలో పర్యటించారు. అనంతరం తాండూరుకు చేరుకొని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ సంపత్‌కుమార్ నివాసానికి వెళ్లారు. తాండూరు ప్రాంత రాజకీయాలు చర్చించారు. వ్యక్తిగత పనుల నిమిత్తం తాండూరుకు వచ్చానని, ఎలాంటి రాజకీయాలు లేవని మాజీ మంత్రి స్పష్టం చేశారు.



సంపత్‌కుమార్‌తో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

తాళం వేసిన ఇళ్లల్లో చోరీ

30 తులాల బంగారు నగలు, రూ.5 లక్షల నగదు అపహరణ



రమేశ్ ఇంటి వద్ద ఆధారాలు సేకరించేందుకు వచ్చిన పోలీసులు

బొంరాస్‌పేట: తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా గుర్తు తెలియని దుండగులు చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటన బొంరాస్‌పేట మండలం ఏర్పుమళ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదుతో శుక్రవారం పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రమేశ్ కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంటికి తాళం ఉండటంతో దొంగలు దాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉంచిన రూ.4 లక్షల నగదు, 30 తులాలు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అనంతరం వడ్డె మాసయ్య ఇంట్లో రూ.10వేలు నగదు, గోనెల పెద్ద నర్సింలు ఇంట్లో రెండున్నర తులాల బంగారం దొంగిలించినట్లు తెలిసింది. అలాగే గ్రామంలోని బాపల్లె హన్మంతు, నట్టలి లలిత తోపాటు మరి కొన్ని ఇళ్లలో చోరీలకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో తేలింది. గ్రామాన్ని కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి

- నేషనల్ అకాడమీ ఆఫ్ ఆడిట్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ నందులాల్
- జనగాం గ్రామంలో పర్యటన



జనగాంలో పర్యటిస్తున్న ఎన్ఏఏఏ అధికారులు

పెద్దేముల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని.. ప్రభుత్వ పథకాలు అందేలా చూడటంతో పాటు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని నేషనల్ అకాడమీ ఆఫ్ ఆడిట్ అండ్ అకౌంట్స్ (ఎన్ఏఏఏ) డైరెక్టర్ డాక్టర్ నందులాల్ అన్నారు. డిప్యూటీ అకౌంట్ జనరల్ డాక్టర్ కామినేని సంజయ్‌రావుతో కలసి శుక్రవారం ఆయన జనగాం గ్రామాన్ని సందర్శించారు. పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్‌లను పరిశీలించారు. అనంతరం పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పల్లె ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించమన్నారు. తెలంగాణలో గ్రామ పంచాయతీ వ్యవస్థ పనితీరు, గ్రామీణ ప్రజల స్థితిగతులను తెలుసుకున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న పంచాయతీరాజ్ వ్యవస్థ, ప్రభుత్వ విధానాలను డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ వివరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వీరి వెంట ట్రైనీ ఐఏఎస్‌లు పీయుష్‌కుమార్ రాయ్, బాలకృష్ణ నల్లయోతు, సీనియర్ ఆడిటర్లు శేఖర్, గౌతమ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, తాండూరు డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, పెద్దేముల్ ఎంపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు మల్లిఖార్జున్, సంజీవ్‌కుమార్, నరేష్ కుమార్, యశ్వంత్, పరమేశ్, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచాలి

అనంతగిరి: పెన్షన్‌లను పెంచాలని కోరుతూ వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లను పెంచాలన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ధర్నాకు బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

పరిగి: మండల పరిధి రాపోల్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నైస్ ఫౌల్ట్రీ ట్రేడర్స్ ఆధ్వర్యంలో బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం ఫౌల్ట్రీ వ్యవస్థాపకుడు మహ్మద్ జావిద్ ఖురేషి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు.

పాఠశాలను సందర్శించిన అధికారులు

వికారాబాద్: బంట్వారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను స్పెషల్ ఆఫీసర్ శంకర్‌నాయక్, ఎంపీడీఓ రాములు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై ఆరా తీసి మాట్లాడారు. సత్వరమే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేలా పనులు పూర్తి చేయాలని సూచించారు. పనులను బట్టే బిల్లుల చెల్లింపు ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో హెచ్ఎం రాంచంద్రయ్య ఉన్నారు.

ప్రశ్నించే హక్కులేదా?

పూడూరు: ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కులేదా అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ ప్రశ్నించారు. శుక్రవారం బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపట్టిన టీజీపీఎస్సీ ముట్టడి సందర్భంగా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

త్వరలో నూతన పారిశ్రామిక విధానం

ఐ.టి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: పరిశ్రమలకు సంబంధించిన అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని, తమది పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వమని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ, ఇన్నోవేషన్, ఇండ్యువల్ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి 'వార్షిక ఎక్సలెన్స్ అవార్డు-2023'లను శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందించారు. కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన రూ.3700 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఇంకా పంపిణీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని పరిశీలిస్తుందని అన్నారు. మూడు నాలుగు వారాల్లో నూతనంగా పటిష్టమైన పారిశ్రామిక విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా భవిష్యత్తులో మొట్టమొదటి ఎమ్ఎస్ఎమ్ఈ పాలసీని ఆవిష్కరించనుందని అన్నారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, ప్రపంచానికి రాష్ట్రాన్ని స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం ఎఫ్‌టీసీసీఐ కృషిని ఎంపీ డాక్టర్ మల్లు రవి అభినందించారు. అంతేకాకుండా ఎంపీగా అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. పారిశ్రామిక అభివృద్ధి లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ భవన నిర్మాణానికి రెండు ఎకరాల భూమి కేటాయించాలని సంస్థ అధ్యక్షుడు మీలా జయదేవ్ కోరారు.

ఆలయ భూములను కాపాడండి


ఎమ్మార్వోకు తట్టెపల్లి ప్రజల వినతి



తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న తట్టెపల్లి ప్రజలు

పెద్దేముల్: కర్ణాటక సరిహద్దు.. పెద్దేముల్ మండల తట్టెపల్లి శివారులో వెలసిన అంబు రామేశ్వర ఆలయ భూములను కాపాడాలని శుక్రవారం ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ కిషన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ సర్వే నంబర్ 265లో ఆలయానికి చెందిన 4.15 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అయితే కొంత మంది ఆ భూమి తమ వారసులకు చెందినదని పట్టా కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఆ భూమి ఆలయానికి చెందినదని ఆలయ చైర్మన్ వెంకటేశం, మాజీ ఎంపీటీసీ శంకర్, తట్టెపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజప్ప, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, మాజీ ఉప సర్పంచ్ కిష్టప్ప తెలిపారు. ఈ భూమిపై కొందరి కన్ను పడిందని, దాన్ని సొంతం చేసుకోడానికి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ భూములను పట్టా చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దార్ కిషన్‌ను వివరణ కోరగా తట్టెపల్లి సర్వే నంబర్ 265లో కాస్తు ప్రకారం పట్టా ఉన్నా అందులో ఎవరూ కాస్తు లేరన్నారు. తమకు తెలియకుండా పట్టా చేసుకుంటే రద్దు చేస్తామని తెలిపారు.

ఐదు తరగతులకు ఒకే టీచర్



అన్ని తరగతులను ఒకే గదిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ఒకే గదిలో బోధన

తాండూరు రూరల్: ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని చెబుతున్నా.. ఆచరణలో అది సాధ్యం కావడం లేదు. ఒకే గదిలో ఐదు తరగతులు కొనసాగుతుండగా.. వీరందిరికీ ఒకే ఒక ఉపాధ్యాయురాలు పాఠాలను బోధిస్తుండటం గమనార్హం. తాండూరు మండలం ఐనెల్లి గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు 43 మంది ఉన్నారు. గతంలో పని చేసిన ఉపాధ్యాయులు విజయ భాస్కర్‌రెడ్డి బదిలీపై గోనూర్ పాఠశాలకు వెళ్లారు. ఇక్కడ పని చేస్తున్న మరో ఉపాధ్యాయురాలు శ్వేత రాణి ఫిబ్రవరి నెల నుంచి సెలవుల్లో ఉంది. ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా బషీరాబాద్ మండలం నవాంద్గీ నుంచి ఉపాధ్యాయురాలు పాపమ్మ శుక్రవారం ఐనెల్లి పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఒకే తరగతి గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు బోధన చేస్తోంది. దీనిపై ఎంఈఓ వెంకటయ్య వివరణ కోరగా.. ఈ పాఠశాలకు ప్రభుత్వం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించిందని, ఇందులో ఒకరు మెటర్నిటీ సెలవుల్లో ఉన్నారని తెలిపారు. 30 మంది విద్యార్థుల కన్నా ఎక్కువగా ఉంటే.. మరో టీచర్‌ను ఐనెల్లికి పంపిస్తామని వెల్లడించారు.

నల్లమల స్టడీ టూర్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి



అమ్రాబాద్‌లో గిరిజనులతో కలిసి మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నల్లమలను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అటవీ ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అధికారులు శుక్రవారం నల్లమలలో పర్యటించారు. ఈ టూర్‌కు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నల్లమలలో లెకో, టెంపుల్, రివర్ టూరిజం సమూహాల అభివృద్ధితో పాటు వసతుల కల్పనపై కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక యువతకు ఉపాధి వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు రెండు రోజుల పాటు టూర్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అచ్చంపేటలోని ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో దర్శనం, మన్ననూర్‌లోని ఈఈసీ, ప్లాస్టిక్ రీసైక్లింగ్ సెంటర్, బయోల్యాబ్‌లతో పాటు మల్లెల తీర్థం జలపాతం, ఆక్టోపస్ వ్యూపాయింట్‌లను పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

అతివేగానికి నిండు ప్రాణం బలి
బైక్‌ను ఢీకొట్టిన కారు, ఒకరి మృతి

కందుకూరు: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఓ యువకుడు స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారాడు. బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం లింగసానిపల్లికి చెందిన సంపంగి మల్లయ్య(33) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటూ బాలాపూర్ చౌరస్తాలో రాయి పనులు చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మండల పరిధిలో శ్రీశైలం రహదారిపై దెబ్బడగూడ గేట్ సమీపంలోని మయూరి పైపుల ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో అతివేగంగా వస్తున్న ఓ కారు మల్లయ్య బైక్‌తో పాటు వెనక వస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి రోడ్డు పక్కకు ఎగిరపడ్డ మల్లయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని బైక్ రెండు కార్ల మధ్య ఇరుక్కుపోయింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆదిలోనే హంసపాదు



చిలుక వాగు నాలాలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- చిలుకవాగు ప్రక్షాళనకు బ్రేక్!
- రూట్ మ్యాప్ చూపని రెవెన్యూ అధికారులు
- సమన్వయ లోపంతో కదలని యంత్రాలు

తాండూరు: చిలుక వాగు ప్రక్షాళన పనులకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. శుక్రవారం పనులు చేపట్టేందుకు యంత్రాలతో వెళ్లిన సిబ్బందికి రెవెన్యూ అధికారులు దారి చూపక పోవడంతో పనులు నిలిచి పోయాయి. మొదటి రోజు అన్ని శాఖల అధికారులు, పోలీసు అధికారుల భద్రతతో పట్టణంలోని వాగు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం నాళా పూడిక తీతకు వెళ్లగా.. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు అడ్డుగా ఉండటాన్ని గుర్తించారు. రెవెన్యూ అధికారులు వాగు పరివాహక ప్రాంతం(నక్ష) చూపించక పోవడంతోనే పనులకు ఆటంకం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీని కారణంగా మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నట్లు సమాచారం.

అడ్డగోలుగా అనుమతులు

మరోవైపు హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఐదేళ్ల క్రితమే వాగు ఆనవాళ్లు లేకుండా పూర్తిగా పూడ్చివేశారు. దీంతో మున్సిపల్ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చి కబ్జాలను ప్రోత్సహించారని రెవెన్యూ అధికారులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం వ్యవసాయ భూముల్లో తమ ప్రమేయం ఉండదని, నాలుగేళ్ల క్రితమే మున్సిపల్ ఆధీనంలోకి వచ్చిందని పేర్కొంటున్నారు. యాలాల మండల రెవెన్యూ పరిధిలోకి వచ్చే వాగు పరివాహక ప్రాంతం కబ్జా రియల్ వ్యాపారులు ప్లాట్లుగా చేసి విక్రయించిన తర్వాత ఇరు శాఖల అధికారులు వాగు ప్రక్షాళన పనులు చేపట్టడంతో పనులు ముందుకు సాగక పోవడం గమనార్హం. ఇదే విషయమై రెవెన్యూ అధికారిని వివరణ కోరగా.. రెవెన్యూ రికార్డుల ప్రకారం పరివాహక ప్రాంతం సర్వే చేయాలంటే కొన్ని రోజుల సమయం పడుతుందని స్పష్టం చేశారు.

కూలీ పనికి వెళ్తుండగా ప్రమాదం
మహిళ చేయి మీదుగా వెళ్లిన స్కూల్ బస్సు

మొయినాబాద్: టీవీఎస్ ఎక్సెల్ లూనా అదుపు తప్పడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన మండల పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన కుడావత్ బోడుక, మున్ని భార్యాభర్తలు. వీరు నగరంలోని గౌలిపురాలో ఉంటూ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఉదయం పని నిమిత్తం నాగిరెడ్డిగూడకు వెళ్తుండగా శ్రీనిధి పాఠశాల వద్దకు రాగానే లూనా అదుపుతప్పి దంపతులు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో అజీజ్‌నగర్ నుంచి కాళీమందిర్ వైపు ప్రయాణిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు అతివేగంగా మహిళ చేతి మీదుగా వెళ్లింది. దీంతో ఆమె ఎడమ చేయి విరిగిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.